క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో ఉత్తరా నక్షత్ర పూజలు



సహపంక్తి భోజనం చేస్తున్నత భక్తులు

నగరి: స్థానిక బైపాస్ కూడలి సమీపంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు సోమవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. భక్తులు భజనలు చేశారు. పాటలు పాడారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి వేలు ఆచ్చారి, జయచంద్రారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

ఉద్యోగోన్నతి, బదిలీపై వెళ్లిన టీచర్లకు సన్మానం



ఉద్యోగోన్నతి, బదిలీపై వెళ్లిన టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

కార్వేటినగరం: మండలంలోని కేఎం పురం ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఉద్యోగోన్నతి, బదిలీపై వెళ్లి ఉపాధ్యాయులకు హెచ్ఎం సునీత ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం మాట్లాడుతూ, ఉత్కృష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో పిల్లల ఉజ్వల భవితకు బాటలు వేసిన టీచర్లను ఎక్కడ పనిచేసినా వారిని మరచిపోరన్నారు. ఇక్కడ నిబద్ధతతో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు సైతం పొందారన్నారు. కార్యక్రమంలో టీచర్లు పి.చంద్రశేఖర్, ఎం.రవి, వై.దామోదరం, కరీం, భాస్కర్, మహ్మద్ ఫరూఖ్, త్యాగరాజు, పట్టాభి తదితరులకు శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మానించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి..

ప్లాట్ల క్రమబద్ధీకరణకు మరో అవకాశం

పుత్తూరు: గత జూన్ 30వ తేదీ లోపు అనధికార లేఔట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గత నెల 26న విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు..2025 అక్టోబర్ 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, క్రమబద్ధీకరించుకునే ప్లాట్లకు 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలలో 50 శాతం రాయితీ ఉంటుందని వెల్లడించారు. అపరాధ రుసుం 45 రోజుల్లోపు చెల్లిస్తే 10 శాతం రాయితీ ఉంటుందని, ఆపై 5 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి పటిష్టమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని, పూర్తి వివరాల కోసం పురపాలక సంఘ వెబ్‌సైట్‌లో గానీ, కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు



ర్యాగింగ వ్యతిరేకత సదస్సులో మాట్లాడుతున్న సీఐ విక్రమ్

నగరి: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని సీఐ విక్రమ్ హెచ్చరించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అధ్యక్షతన ర్యాగింగ్ వ్యతిరేక సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐ మాట్లాడారు. ఎవరైనా సరే ర్యాగింగ్‌కు పాల్పడితే కేసుల మూలాన చేజేతులా జీవితాన్ని నష్టపోతారన్నారు. అంతే కాకుండా నిందితులు తాము ర్యాగింగ్ చేయలేదని సాక్ష్యాధారాలతో తమకు తామే నిరూపించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రాసిక్యూషన్ సైతం ఈ విషయంలో బాధ్యత తీసుకోదన్నారు. అంతేగాక ర్యాగింగ్ అనేది కళాశాల ఆవరణలో మాత్రమే కాదని కళాశాలకు వచ్చే దారిలోను, వసతి గృహాలలోనూ ఎక్కడ ర్యాగింగ్ చేసినా నేరస్తులే అవుతారని స్పష్టం చేశారు. ఎస్ఐ తేజస్విని మాట్లాడుతూ సెల్‌ఫోన్, వాట్సాప్ డీపీలుగా తమ ఫోటోలను ఉంచుకోరాదన్నారు. అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పూతలపట్టు(యాదమరి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని.. దీనికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించినా శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని చిత్తూరు సివిల్ జడ్జి భారతి హెచ్చరించారు. సోమవారం పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన బాల్య వివాహాలపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. బాల్య వివాహం వల్ల బాలికలు గర్భం దాల్చే సన్నద్ధత లేకపోవడంతో పుట్టబోయే బిడ్డకు, తల్లికి ప్రాణహాని ఉంటుందన్నారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ మాట్లాడుతూ, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తేవాలన్నారు.

దివ్యాంగులపై కూటమి విషం



ఈ చిత్రంలోని మహిళ పేరు కె.గాయత్రి. వయస్సు 37 సంవత్సరాలు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం దళితవాడకు చెందిన మునయ్య, మునెమ్మ దంపతుల తొలి సంతానం. ఈ అమ్మాయి పుట్టినప్పటి నుంచి బుద్ధిమాంద్యంతో బాధపడుతోంది. చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో అమ్మమ్మే వ్యయ ప్రయాసలతో కాపాడుతూ వచ్చింది. దివ్యాంగులకు పింఛను తీసుకోవచ్చునన్న విషయం కూడా తెలియని అమ్మమ్మ సైతం కరోనా సమయంలో మృతి చెందింది. దీంతో ఆమె తమ్ముడే అక్క ఆలనా పాలనా చూస్తున్నాడు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఈమెకు జీవితకాల బుద్ధిమాంద్య సర్టిఫికెట్ ఇచ్చి రూ.6 వేల పింఛన్ మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం ఈమెకు గత నెల నుంచి వస్తున్న పింఛను ఆపేసింది. దీంతో అక్క పోషణ తమ్ముడిపై మోయలేని భారంగా పరిణమించింది.



వెరిఫికేషన్ కోసం దివ్యాంగుల పాట్లు

- వెరిఫికేషన్ పేరిట అవస్థలు
- వైకల్యం పర్సెంటేజ్ తగ్గించి తొలగింపులు
- ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు
- గగ్గోలు పెడుతున్న లబ్ధిదారులు

పుత్తూరు: అభాగ్యులు ఎక్కడ ఉన్నారో గుర్తించి మరీ కూటమి ప్రభుత్వం వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొడుతోంది. పింఛన్ పెంచినట్లే పెంచి ఇప్పుడు పర్సంటేజీల పేరుతో తొలగింపులకు శ్రీకారం చుట్టింది. కొత్తగా సదరం పరీక్షలు చేయించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యయ ప్రయాసలతో దూరప్రాంతాలకు వెళ్లి పరీక్షలు చేసుకొంటే అక్కడ వైకల్యం తక్కువగా ఉందంటూ పింఛన్లు ఎగ్గొట్టేస్తోంది. ఏళ్ల తరబడి పొందుతున్న పింఛను ఇకపై రాదని తెలియగానే ఆకుటుంబం ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి నెలకొంది. ఒక్క పుత్తూరు మున్సిపాలిటీలో దివ్యాంగులు 576, అనారోగ్యంతో ఉన్నవారు 27 మందితో కలిపి మొత్తం 603 మంది ఉండగా 56 మందిని తొలగించారు. పుత్తూరు రూరల్ మండలంలో దివ్యాంగులు, అనారోగ్యం కలవారు మొత్తం 443 మంది ఉండగా 113 మందిని తొలగించారు. దీంతో లబ్ధిదారులు అన్యాయం అంటూ గగ్గోలు పెడుతున్నారు.

మూల్యం చెల్లించుకోక తప్పదు



కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం నేటి దివ్యాంగుల పింఛన్ల తొలగింపు. గత ప్రభుత్వంలో అభిమానంతో తీసుకున్న ఫొటోలను చూపి మేమే పింఛన్లు తొలగించామని చెబుతున్న కూటమి నాయకుల నిరంకుశ వైఖరికి నిదర్శనం. తమకు ఎవరు ఎలాంటి ఇబ్బందులకు గురిచేస్తున్నారో కూడా తెలియని అభాగ్యులపై జరుగుతున్న అన్యాయానికి భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

–ఇ.చిరంజీవి, వైఎస్ఆర్ సీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, పుత్తూరు

దివ్యాంగుల కోసం ఉద్యమిస్తాం



రీ వెరిఫికేషన్ పేరిట అర్హులైన దివ్యాంగులను పింఛన్ల నుంచి తొలగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే పింఛన్ పంపిణీ హామీ అమలు తీరు ఇదేనా? అర్హత ఉండి పింఛన్ అందుకోలేక పోతున్న వారిలో ఆందోళన మొదలైంది. జిల్లాల వారీగా తొలగించిన వారి జాబితాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదు.

–కె.శివయ్య, ప్రెసిడెంట్, నేషనల్ ఆర్టీఐ అసోసియేషన్, పుత్తూరు

డిగ్రీ ప్రవేశాలకు నేడు ఆఖరు

పుత్తూరు: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి మంగళవారంతో గడువు ముగుస్తుందని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల నిమిత్తం సాయంత్రం 5 గంటల లోపు కళాశాలకు వచ్చి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. కళాశాలలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఉచితంగా చేస్తారని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పారిశుధ్యంపై ఎంపీడీఓ సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం: ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.విద్యావతి ఆదేశించారు. సోమవారం ఆమె సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ, ఇళ్ల పరిసరాల్లో వర్షపునీరు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు, పారిశుధ్య కార్మికులతో కలసి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలన్నారు. అలాగే, అన్ని గ్రామాల్లో వీధి లైట్లు వెలిగేలా సర్పంచులు చొరవ చూపాలన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకే ప్రభుత్వం కుట్ర

- గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి విమర్శ



కృపాలక్ష్మి

పాలసముద్రం: దివ్యాంగుల పెన్షన్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని గంగాధరనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి ఆరోపించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ హామీని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం వస్తున్న పెన్షన్లను తొలగించే పనిలో పడిందని మండి పడ్డారు. తొలివిడతగా దివ్యాంగ పెన్షన్లపై దృష్టి పెట్టి, వైకల్య శాతం తగ్గించి, వారి కడుపు కొడుతోందని విమర్శించారు. దివ్యాంగులను మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సింది పోయి వారి జీవితాలతో ఆటలాడుకుంటోందని ధ్వజమెత్తారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ 200 పెన్షన్ తీసుకున్న వికలాంగులపై సైతం ఇప్పుడు అనర్హత వేటు వేయడం విడ్డూరంగా ఉందని, అంగవైకల్యం తగ్గిందని ధృవీకరిస్తున్న ఇప్పటి డాక్టర్లది తప్పా? లేదా అప్పుడు ఇచ్చిన వైద్యులది తప్పా? అని ప్రజలే ప్రశ్నిస్తున్నారన్నారు. వైకల్యం శాతం తక్కువ, తాత్కాలిక వైకల్యం కారణంగా పెన్షన్ నిలిపివేయనున్నట్లు మండల పరిషత్, సచివాలయ నుంచి నోటీసులు అందుకున్న వారు అర్హులుగా భావిస్తే తమ వివరాలను ఎంపీడీఓ కార్యాలయాలలో నమోదుకు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తొలగించిన దివ్యాంగుల పెన్షన్లను పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు.

మండలాభివృద్ధికి కృషి చేద్దాం: ఎంపీపీ



ఎంపీపీ హేమలతారెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓ రాజేంద్రన్

పెనుమూరు(కార్వేటినగరం): మండలాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని పెనుమూరు ఎంపీపీ మహాసముద్రం హేమలతారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. మండల వెలుగు సమాఖ్యలో అవకవతవకలు చోటుచేసుకుంటున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. రాజకీయ ఒత్తిడితో సిబ్బందిని తొలగించి కొత్తగా మరో వ్యక్తిని నియమించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఏ పని చేసినా తన దృష్టికి తేవాలన్నారు. అనంతరం ఎస్ఐ వెంకట నరసింహ మాట్లాడుతూ, గ్రామాల్లో చవితి ఉత్సవాలకు సంబంధించి వినాయక ప్రతిమల ఏర్పాటుకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి అనుమతి పొందాలన్నారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిదారులకు చిన్న చిన్న పొరబాట్ల వల్ల నిధులు జమ కాలేదన్నారు. లబ్ధిదారులు వ్యవసాయశాఖ, గ్రీవెన్స్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే పెనుమూరు జెడ్పీ హైస్కూల్లో ఏళ్ల కాలంగా పీడిస్తున్న సమస్య పరిష్కారానికి ఎంపీపీ రూ.3లక్షలతో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేయడంపై ఎంఈఓ రాజేంద్రన్ కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ ఎంపీపీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొరస్వామి యాదవ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కిశోర్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ తులసీ ప్రసాద్, మండల వ్యవసాయశాఖాధికారి సుహార్ లత, ఎంపీటీసీ సభ్యులు శివలింగం, సుబ్రమణ్యంరెడ్డి, సుజాత, పళని, సర్పంచులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

విజయకాంత్‌కు ఘన నివాళి



విజయకాంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆయన అభిమానులు

నగరి: దివంగత నటుడు, డీఎండీకే పార్టీ వ్యవస్థాపకులైన విజయకాంత్ 72వ జయంతి వేడుకలను ఆయన అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పుదుపేటలో ఆయన చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. కేట్‌కట్ చేసి స్వీట్లు పంచారు. పేదలకు అన్నదానం చేశారు. విజయకాంత్ పేదలకు చేసిన సేవలను పార్టీ నేతలు, అభిమానులు స్మరించారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీరంగరాజపురం: మండలంలోని గంగమ్మగుడి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ స్కూలు ప్రధానోధ్యాయురాలు కళావతి తెలిపారు. జిల్లా స్థాయిలో రామకుప్పం గురుకుల పాఠశాలలో నిర్వహించిన షూటింగ్‌బాల్ పోటీల్లో 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు వి.రేష్మ, టి.రక్షిత, ఎం.ఆకాష్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.సెప్టెంబర్ 13,14వ తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో నిర్వహించనున్న నిర్వహించు రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున వీరు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు లోకనాథంను అధికారులు అభినందించినట్లు తెలిపారు. టీచర్లు పద్మశ్రీ, బాలాజి, చంద్రశేఖర్, బాబు, సత్య, సరోజమ్మ, జానకి, ప్రసన్నకుమారి, అరుణ, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నూతన వధూవరులతో మాజీ మంత్రి ఆర్కేరోజా

● ఆశీస్సులు

నగరి: మున్సిపాలిటీలోని కాకవేడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాజముత్తు మనవరాలు వివాహం రిసెప్షన్ నాగలాపురంలోని ఒక కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. మాజీ మంత్రి ఆర్కేరోజా నూతన వధూవరులను ఆశీర్వదించారు. మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, నాయకులు చిన్నదొరై, రమేష్‌రెడ్డి, మునివేలు, మురుగ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అవసరం



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీదేవి

పుత్తూరు: రైతు ఉత్పత్తిదారుల సంఘాలతోనే రైతుల సంఘటిత శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక రాస్ కార్యాలయంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ (ఆత్మ) చిత్తూరు ఆధ్వర్యంలో కేవీకే వారు రైతు ఉత్పత్తిదారు సంఘాల ఏర్పాటు, నిర్వహణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గత 32 ఏళ్లుగా కేవీకే నిర్వహిస్తున్న భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యం, డ్రోన్ల వినియోగం, నీటి సంరక్షణ పద్ధతుల గురించి వివరించారు. ముఖ్య అతిథిగా త్తూరు డివిజన్ ఏడీఏ లక్ష్మీదేవి మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని, తద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు. ప్రధానంగా భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని, ఇష్టానుసారంగా ఎరువులు వినియోగిస్తే నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కోదండయ్య, విస్తరణాధికారి రామ్‌కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రవి, రైతులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి



చవితి ఉత్సవాల నిర్వహణపై కమిటీలతో సమీక్షిస్తున్న తహసీల్దార్

పాలసముద్రం: మండలంలో వినాయక చవితి ఉత్సవాల ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సర్పంచులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సహకరించాలని తహసీల్దార్ అరుణకుమారి కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వినాయక ఉత్సవ కమిటీలతో సమీక్షించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, వినాయక మండపాలు, పందిళ్ల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలని, ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని పాటించాలన్నారు. ఇతర మతాల వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించరాదన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్సులు, నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాల అనుమతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విద్యావతి, మండల విస్తరణాధికారి సత్యనారాయణ, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, మహేష్, అయ్యప్ప, జీవిత, అనురేఖ, షీబా, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యలకు పరిష్కారం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాటి మంత్రి ఆర్కే రోజా (ఫైల్)

- నాడు మంత్రి రోజా చొరవతో రోడ్డు వేశారు
- నేడు సర్పంచ్ గిరిజాప్రసాద్ చొరవతో వీధిలైట్లు ఏర్పాటు

పుత్తూరు: వేపగుంట పంచాయతీ అక్కెరి దళితవాడలో దశాబ్దాల నాటి సమస్యలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పరిష్కారం చూపగా, ఇప్పుడు గ్రామ సర్పంచ్ గిరిజాప్రసాద్ వాటిని పూర్తి చేశారు. వివరాలు.. వేపగుంట నుంచి సుమారు అర కిలో మీటరు దూరంలోని అక్కెరి దళితవాడకు వెళ్లేందుకు దారిలేక, వీధి లైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై స్పందించిన నాటి మంత్రి రోజా రైల్వే సమస్యలను అధిగమించి గత ఏడాది ఫిబ్రవరి 8న రోడ్డు పనులను ప్రారంభించారు. రూ.5 లక్షల పంచాయతీ రాజ్ నిధులతో 540 మీటర్ల మేరకు రోడ్డు పనులను పూర్తి చేయించారు. సోమవారం సర్పంచ్ గిరిజా ప్రసాద్ ఈ దారి మీదుగా కొత్తగా 5 విద్యుత్ స్తంభాలు నాటించి, స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయిస్తున్న గిరిజా ప్రసాద్

లక్ష్యానికి పేదరికం అడ్డుకాదు

- డీఎస్సీలో సత్తా చాటిన పుత్తూరు వాసి
- నాలుగు ఉద్యోగాలకు అర్హత



ముత్యాల మోహన్‌ను సత్కరిస్తున్న అకాడమి ప్రతినిధి

పుత్తూరు/తిరుపతి కల్చరల్: సాధించాలనే లక్ష్యం ఉంటే పేదరికం అడ్డుకాదని ఓ నిరుపేద అభ్యర్థి తన సత్తా చాటాడు. డీఎస్సీలో ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించాడు. వివరాలు.. పుత్తూరు, లక్ష్మీనగర్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన ముత్యాల మోహన్ చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో తల్లి రత్న మోహన్‌తో పాటు మరో ఇద్దరు కుమారులను కూలీ పనులు చేస్తూ కష్టపడి చదివించింది. మోహన్ తిరుపతిలోని ఒక అకాడమీలో డీఎస్సీ కోసం రెండేళ్ల పాటు శిక్షణ పొంది డీఎస్సీ రాశాడు. డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా స్థాయిలో 23వ ర్యాంకు, అలాగే ఎస్‌జీటీలో జిల్లా స్థాయిలో 26వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగం 27వ ర్యాంకు, టీజీటీ సోషల్ విభాగంలో రాయలసీమ జోన్-4 విభాగంలో 35వ ర్యాంకు సాధించి నాలుగు టీచర్ ఉద్యోగాలకు అర్హత సాధించాడు. మోహన్‌కు శిక్షణ ఇచ్చిన హేమశ్రీ డీఎస్సీ అకాడమి అధినేత శ్రీను ఘనంగా సత్కరించి అభినందించారు.

చరిత్ర ఘనం.. పరిరక్షణ శూన్యం



దుస్థితికి చేరుకున్న లక్ష్మీ మహల్



పిచ్చిమొక్కలతో కనిపిస్తున్న లక్ష్మీ మహల్

- శిథిలావస్థకు చేరుకుంటున్న లక్ష్మీమహల్
- పూర్వ వైభవం కోసం ఎదురుచూపు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం, పురావస్తుశాఖ

కార్వేటినగరం: సంస్థానాధీశులు సుమారు మూడు శతాబ్దాల క్రితం నిర్మించిన లక్ష్మీ మహల్(అద్దాలమేడ) పరిరక్షణకు చర్యలు తీసుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటోంది. చారిత్రక కట్టడాలకు నిలయమైన కార్వేటినగరంలో అప్పటి సంస్థానాధీశులైన రాజా వెంకట పెరుమాళ్‌రాజు లక్ష్మీమహల్‌ను సున్నంతో పాటు కోడి గుడ్ల సొనతో అద్భుతంగా నిర్మించి రాణికి బహుమానంగా ఇచ్చినట్లు చరిత్ర కథనం. కాలక్రమంలో కోట ఆలనా పాలనా కొరవడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరమ్మతుల నిమిత్తం రూ.3 లక్షలు మంజూరు చేసింది. అలాగే, చంద్రగిరి కోట తరహాలో మ్యూజియం ఏర్పాటు చేసేందుకు పురావస్తుశాఖకు అప్పగించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ చారిత్రక కట్టడం పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం లేదనే విమర్శలు మూటకట్టుకుంది. ఫలితంగా పిచ్చిమొక్కలతో నిండి అడవి తలపిస్తోంది. ఇప్పటికైనా పురావస్తు శాఖ అధికారులు స్పందించి లక్ష్మీమహల్‌కు పూర్వ వైభవం తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.